తెలంగాణ
# ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ | సంపుటి : 01 | సంచిక : 01 | మంగళవారం | 07 - 07 - 2026 | ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి | పేజీలు : 2

## రూ.15 కోట్ల నిధులకు కమిషన్ల కోసమే..

# రహస్యంగా టెండర్ నోటిఫికేషన్

## మోత్కూరులో మున్సిపల్ కౌన్సిలర్ల మీడియా సమావేశం



- ఎమ్మెల్యే, చైర్మన్ భర్తతో కుమ్మక్కై, దొడ్డిదారిన నోటిఫికేషన్ వేశారని కమిషనర్‌పై ఆరోపణలు
- వైస్ చైర్మన్, కౌన్సిలర్లకు సమాచారం లేకుండా రహస్యంగా వేయాల్సిన అవసరం ఏమొచ్చింది
- నిధులను దుర్వినియోగం చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరిక
- మీ కమిషన్ల కోసం మమ్ములను మమ్ములను బలి చేస్తారా అని ఆవేదన
- కమిషనర్, చైర్మన్ భర్త పై కౌన్సిలర్ల తీవ్ర ఆరోపణలు
- వార్డుల్లో పనుల ఆమోదంతో కొత్త టెండర్ పిలవాలని కౌన్సిలర్ల డిమాండ్

**ప్రజావారధి/మోత్కూరు**

మోత్కూరు మున్సిపాలిటీలో అభివృద్ధి పనుల కోసం మంజూరైన రూ.15 కోట్ల నిధులకు కమిషన్ల కోసమే రహస్యంగా టెండర్ నోటిఫికేషన్ వేశారని మున్సిపల్ వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న, కౌన్సిలర్లు ఆరోపించారు. రహస్యంగా వేసిన నోటిఫికేషన్‌పై మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడేందుకు వైస్ చైర్మన్‌తో సహా 8 మంది కౌన్సిలర్లు సోమవారం మున్సిపల్ కార్యాలయానికి రాగా మధ్యాహ్నం వరకు కమిషనర్ రాకపోవడంతో వారు విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న, కౌన్సిలర్ నల్ల మధు మాట్లాడుతూ కౌన్సిలర్లకు సమాచారం ఇవ్వకుండా, కౌన్సిల్ ఆమోదం లేకుండా కమిషనర్ దొడ్డిదారిన నోటిఫికేషన్ వేయాల్సిన అవసరం ఏమొచ్చిందని, కమిషనర్ ఇవ్వాల ఉంటారు రేపు పోతారని, కానీ ప్రజాప్రతినిధులుగా మేం ఇక్కడే ఉండి ప్రజలకు సమాధానం చెప్పాల్సి ఉంటుందన్నారు. గతంలోనే వార్డుల్లో మురికి కాల్వలు, సీసీ రోడ్లు, ఇతర పనులు కాకుండా ఎక్కడో ప్రైవేట్ వెంచర్లలో, ప్రజలు అక్కరకు రానిచోట ఇష్టారాజ్యంగా పనులు పెట్టి సింగిల్ టెండర్‌తో పొందిన పనులను కౌన్సిల్ ఆమోదంతో రద్దు చేయించామని, అయినా మళ్లీ అదే విధంగా పనులు పెట్టి రహస్యంగా నోటిఫికేషన్ వేశారన్నారు. స్థానిక ఎమ్మెల్యే, చైర్మన్ భర్త కుమ్మక్కై, కమిషన్ల కోసం, నిధులు పక్కదారి పట్టించే ప్రయత్నం జరుగుతుందని ఆరోపించారు. మేం బాధ్యతలు చేపట్టే నాటికి మున్సిపాలిటీలో రూ.ఒక కోటి 27 లక్షల నిధులు ఉన్నాయని, కౌన్సిలర్లకు తెలియకుండా సుమారు రూ.50 లక్షలకు పైగా కౌన్సిలర్లకు తెలియకుండా డ్రా చేశారని తెలిపారు. మున్సిపల్ బ్యాంక్ ఖాతా వివరాలు, ఆదాయ, వ్యయాల లెక్కలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధుల వివరాలు, కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపుల వివరాలు, ప్రస్తుతం మున్సిపాలిటీలో నిల్వ ఉన్న నిధుల వివరాలేవీ తమకు చెప్పడం లేదన్నారు. కొత్త కమిషనర్ వచ్చి నెల రోజులవుతున్నా పాలకవర్గంతో జనరల్ మీటింగ్ ఎందుకు పెట్టడం లేదని, కౌన్సిలర్లతో మాట్లాడేందుకు సమయం లేని కమిషనర్‌కు రూ.15 కోట్ల నిధులపై మాత్రం అంత తొందర ఎందుకని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే, చైర్మన్ భర్త, గత పాలకుల జోక్యం పెరిగిపోయిందని, రూ.15 కోట్ల నిధుల వ్యవహారం వెనకాల నిధులను పక్కదారి పట్టించి దోచుకునే కుట్ర కనిపిస్తోందని ఆరోపించారు. కోతుల పట్టివేత అన్ని వార్డుల్లో చేపట్టకుండా రెండు, మూడు వార్డుల్లో కొన్ని రోజులు పట్టించి మిగతా వార్డుల్లో పట్టించలేదని, ఎన్ని కోతులు పట్టించారు.. ఎన్ని డబ్బులు చెల్లించారన్నది చెప్పడం లేదన్నారు. సోలార్ ప్లాంట్ అనుమతులు, కొత్తగా సిబ్బంది నియామకాలు, కొత్త ఇండ్ల అనుమతులు, పెండింగ్ బిల్లుల చెల్లింపుల్లో చైర్మన్ భర్త జోక్యం పెరిగిపోయి అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. స్థానిక కౌన్సిలర్లకు చెప్పకుండా వార్డుల్లో చైర్మన్ భర్త పెత్తనం చెలాయిస్తున్నాడని, తమ వార్డుల్లో పెత్తనం చేయాలని చూస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. 12 వార్డుల్లో మురికి కాల్వలు, సీసీ రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ప్రజలకు హామీ ఇచ్చామని, ప్రతి వార్డుకు సమానంగా నిధులు కేటాయించే వరకు ఈ టెండర్లను అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై, కమిషనర్ వ్యవహరిస్తున్న తీరుపై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. 12 వార్డుల్లో ప్రజావసరాల కోసం సమానంగా నిధులు కేటాయించి కౌన్సిలర్లు ఆమోదించిన పనులకే టెండర్లు పిలవాలని, అక్రమాలకు పాల్పడితే తమకున్న హక్కులను వినియోగించుకుని ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడతామన్నారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు కుర్మిళ్ల ప్రమీల, బీసు శ్రీకాంత్, కారుపోతుల వెంకన్న, మెంట రమణ, సుల్తాన్ స్వామి, నాయకులు కొండ సోంమల్లు, మెంట నగేష్, కుర్మిళ్ల రాములు తదితరులు పాల్గొన్నారు.

## కౌన్సిల్ తీర్మానం లేకుండా వేసిన..

# రూ.15 కోట్ల టెండర్ రద్దు చేయాలని అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు

- స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్‌కు వైస్ చైర్మన్, కౌన్సిలర్ల వినతి
- పాలకవర్గానికి సమాచారం లేకుండా టెండర్ వేశారన్న కౌన్సిలర్లు
- టెండర్ రద్దు చేసి కౌన్సిల్ ఆమోదంతో కొత్త టెండర్ వేయాలని కోరిన కౌన్సిలర్లు



**ప్రజావారధి/మోత్కూరు**

మోత్కూరు మున్సిపాలిటీలో కౌన్సిలర్లకు సమాచారం ఇవ్వకుండా, కౌన్సిల్ తీర్మానం లేకుండా రహస్యంగా వేసిన రూ.15 కోట్ల పనుల టెండర్ నోటిఫికేషన్‌పై వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్నతో సహా ఏడుగురు కౌన్సిలర్లు సోమవారం యాదాద్రి స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ భాస్కర్‌రావుకు ఫిర్యాదు చేశారు. కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌన్సిలర్లకు చెప్పకుండా గతంలో సింగిల్ టెండర్‌తో ఒకే కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించడంతో పాలకవర్గం వ్యతిరేకించి మెజార్టీ కౌన్సిలర్ల తీర్మానంతో టెండర్ రద్దయ్యిందని గుర్తు చేశారు. ప్రస్తుతం స్థానిక ఎమ్మెల్యే, చైర్మన్ భర్త, మున్సిపల్ కమిషనర్ కుమ్మక్కై కౌన్సిలర్లకు సమాచారం ఇవ్వకుండా, పాలకవర్గం ఆమోదం లేకుండానే రహస్యంగా టెండర్ నోటిఫికేషన్ వేశారని, ఇందులో కమిషన్లు, నిధులు పక్కదారి పట్టించే కుట్రకోణం ఉందని ఆరోపించారు. సింగిల్ టెండర్‌తో అవినీతి, అక్రమాలకు ఆస్కారం ఉందని, 12 వార్డుల్లో సమాన నిధులు కేటాయించి కౌన్సిలర్లు చెప్పిన పనుల ఆమోదంతోనే టెండర్ పిలవాలని విన్నవించారు. ప్రతి పనికి వేర్వేరుగా టెండర్ పిలవకుండా రూ.15 కోట్ల నిధులకే ఒకేసారి ఒక్క టెండర్ నోటిఫికేషన్ ఇవ్వడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా కౌన్సిలర్లకు తెలియకుండా వేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని, మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై, మున్సిపల్ కమిషనర్ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై పూర్తి విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటానని అడిషనల్ కలెక్టర్ హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కారుపోతుల వెంకన్న, బీసు శ్రీకాంత్, కుర్మిళ్ల ప్రమీల, మెంట రమణ, నల్ల మధు, సుల్తాన్ స్వామి, కొండ శోభసోంమల్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల మూసివేత నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి



- తెలంగాణ క్రాంతిదళ్ రాష్ట్ర అధ్యక్షులు సంగంరెడ్డి పృధ్వీరాజ్
- మన ఊరు మనబడిని కాపాడుకుందాం అంశంపై మోత్కూరులో రౌండ్ టేబుల్ సమావేశం

**ప్రజావారధి/మోత్కూరు**

విద్యార్థులు సంఖ్య తక్కువ ఉందనే సాకుతో ప్రభుత్వ పాఠశాలల మూసివేత ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ క్రాంతిదళ్ రాష్ట్ర అధ్యక్షులు సంగంరెడ్డి పృధ్వీరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మోత్కూరులోని ఆర్యవైశ్య భవనంలో తెలంగాణ క్రాంతి దళ్ మండల కమిటీ ఆధ్వర్యంలో మన ఊరు- మనబడిని మనమే కాపాడుకుందాం అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం మండల కోఆర్డినేటర్ కొంపల్లి వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పృధ్వీరాజ్ పాల్గొని మాట్లాడుతూ ఎన్నికల ముందు మూతపడిన బడులను తెరిపిస్తామని అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి రెండున్నర ఏళ్లలోనే 23 వేల ప్రభుత్వ పాఠశాలు మూసివేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు కొనసాగుతున్న పాఠశాలలను ఏకోపాధ్యాయునితో ప్రభుత్వం నెట్టుకొస్తుందని, కానీ ప్రతి తరగతికి ఉపాధ్యాయుడు ఉండాలనే నిబంధనలను పూర్తిగా విస్మరించిందన్నారు. రాష్ట్రంలో 633 మండలాలకు అన్ని మండలాలకు ఎంఈవోలు ఉండాల్సి ఉండగా కేవలం ఇద్దరు మాత్రమే రెగ్యులర్ ఎంఈవోలు ఉన్నారని, దీన్ని బట్టి ప్రభుత్వ విద్యావ్యవస్థ ఏ విధంగా ఉందో అర్థమవుతుంద న్నారు. రాష్ట్రంలో 44 లక్షల మంది ప్రభుత్వ పాఠశాల సంక్షేమ పాఠశాలలను చదువుకున్న సాగిస్తున్నారని అందులో 1,19 వేల మందికి మధ్యాహ్న భోజనం పెడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయమంటే విద్యాశాఖ మంత్రి. తాను అడ్డుపెట్టుకొని ప్రైవేట్ యూనివర్సిటీలను,,కార్పొరేట్ పాఠశాలలను, వైద్య రంగాన్ని ముఖ్యమంత్రి ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. పల్లెలలో సరైన విద్యను నోచుకోలేక బార్లు ఫంక్షన్ హాల్ లో కూలీ పనులు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రతి పేదవాడికి ఉన్నత విధి నోచుకోవాలంటే పల్లెలలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో మూసి వేయకుండా ప్రతి ఒక్కరూ సైనికుల సమిష్టిగా ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు అక్కేనపల్లి వెంకటాచారి, డిటిఎఫ్ జిల్లా ప్రతినిధి బోళ్ల హనుమంత్, రిటైర్డ్ ఉపాధ్యాయులు అవిశెట్టి అవిలిమల్లు, బిసి రిజర్వేషన్ సాధన సమితి జిల్లా నాయకులు కలిమేల నర్సయ్య, మండల అధ్యక్షులు శివార్ల శ్రీనివాస్ యాదవ్, వి.ఆర్.పి. జిల్లా అధ్యక్షులు ఎడ్ల నరేష్ పట్టణ బిజెపి మాజీ అధ్యక్షులు పోచం సోమయ్య, డిఫెన్స్ వినియోదారుల సంఘం అధ్యక్షులు గుమ్మిడెల్లి పరశురాములు, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు జిట్ట గౌతమ్, ప్రైవేట్ డిగ్రీ కళాశాల అసోసియేషన్ ఉమ్మడి నల్గొండ జిల్లా ఉపాధ్యక్షులు చౌగోని సత్యం, తెలంగాణ క్రాంతి దళ్ జిల్లా ఇంచార్జీ రాము మండల ప్రధాన కార్యదర్శి కూరెళ్ళ ఉదయ్, సహాయ కార్యదర్శులు మెంట స్వామి, బందెల శ్రీను, గణేష్ తదితరులు పాల్గొన్నారు.